ప్రజాశక్తి

బుధవారం 16 నవంబర్ 2022 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

స్థలం కొనుగోలు చేసైనా..

పేదలకు పట్టాలిస్తాం..

- విల్లాస్ స్థలాల విషయంలో నా ప్రమేయం ఉందని నిరూపిస్తే రాజీనామా చేస్తా..
- గడపగడపకూ.. వస్తున్న ఆదరణ చూడలేకనే నిరాధార ఆరోపణలు
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

'నగరంలోని 24 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే ఉద్దేశంతో యరజర్ల వద్ద స్థలాన్ని సేకరించాం. మాజీ ఎమ్మెల్యే దాచర్ల జనార్ధన్.. ఆయన పార్టీ వాళ్ల ద్వారా కోర్టు లో కేసు వేయించాడు. పట్టాలు ఇవ్వకుండా అడ్డుకున్నాడు. ఎవరెన్ని కుట్రలు చేసినా పట్టాల పంపిణీ ఆగదు. ఆ స్థలం వీలుకాకపోతే ఇంకెక్కడైనా స్థలం కొనుగోలు చేసైనా 24 వేల మంది పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి తీరుతాం' అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక 22వ డివిజన్‌లో జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సోమవారం మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆయనపై చేసిన వ్యాఖ్యలకు స్పందించారు. ఒంగోలు నగరంలో పేదలకు టిడ్కో ద్వారా ఇళ్లు ఇచ్చేందుకు రూ.500 మాత్రమే కట్టించుకున్నామని జనార్ధన్ చెబుతున్నారని, కానీ అంతకంటే ఎక్కువ కట్టించుకున్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని బాలినేని చెప్పారు. అసలు ఇళ్లు ఇవ్వడానికి ముందుగా ▶ 2లో

జనరల్ ఫండ్‌తోనే సరి..

- జడ్పీ ఏడాది పాలన పూర్తి
- ప్రత్యేక గ్రాంట్లు లేక పనులు ప్రశ్నార్థకం
- నేడు జిల్లాపరిషత్ సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లా పరిషత్ పాలకవర్గం బాధ్యతలు చేపట్టి ఏడాది గడిచింది. గత ఏడాది సెప్టెంబర్ నెలాఖరులో జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి జిల్లాపరిషత్‌లో పాలన సజావుగా సాగుతోంది. ఛైర్‌పర్సన్‌గా వెంకాయమ్మ తన శక్తి మేరకు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కారుణ్య నియామకాల ద్వారా వివిధ విభాగాల్లో సుమారు 54 మందికి పోస్టులు కేటాయించారు. ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగునింపారు. ఇక అభివృద్ధిపరంగా చూస్తే నిధులు ఆశించిన స్థాయిలో లేవు. ప్రత్యేక గ్రాంట్లు లేవు. సాధారణ(జనరల్) ఫండ్‌తోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి వచ్చింది.



స్థానిక సంస్థల పాత్ర ప్రశ్నార్థకంగానే మారిందనే చెప్పాలి. అన్ని రకాల నిధులను రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు లాగేయడంతో ఇక్కడ కనీసం మినరల్ సెస్ ద్వారా వచ్చే నిధులు కూడా ఖర్చు పెట్టుకునే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మండలాల్లో అభివృద్ధి పనులు పెద్దగా లేవనే చెప్పాలి. అరకొరగా ఉన్న జనరల్‌ఫండ్‌తో తాగునీటి పథకాల నిర్వహణ, విద్యుత్‌బిల్లుల చెల్లింపులు, పాఠశాలల నిర్వహణకే సరిపోతున్నాయి. మండలాల్లో కనీసం సౌకర్యాలు మెరుగుదలకు భారీగా పనులేమీ చేపట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.16.83 కోట్లు, ఈ ఏడాది ఇప్పటివరకూ రూ.18.28 కోట్లు మంజూరు చేశారు. వీటిని రోడ్లు, తాగునీరు, పాఠశాలల నిర్వహణకు వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాపరిషత్ పాలన జిల్లాల పరిధిలోనే ఉంది. అంటే 56 మండలాల్లో ఈ నిధులు వెచ్చించారు. మండలానికి ఎంత అనేది చూస్తే చాలా స్వల్పంగానే ఉన్నాయి. కొత్తగా జడ్పీటీసీలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఒక గది నిర్మాణం కోసం రూ.5 లక్షలు చొప్పున 20 మండలాలకు కోటి రూపాయలు కేటాయించారు. జడ్పీ పాలకవర్గం ద్వారా ఇప్పటివరకూ రూ.35.95 కోట్లు మంజూరు ఇచ్చారు.

ఇక పనుల కోసం మండలాల్లోని ద్వితీయ శ్రేణి నేతలు జడ్పీటీసీలు, ఎంపీపీలు ఒత్తిళ్లు పెంచారు. ఎటువంటి ఆదాయం లేనందున జడ్పీ జనరల్‌ఫండ్ నుంచి పనులు చేసుకునేందుకు సిఫార్సులు పెంచారు. ఎమ్మెల్యేలు, మంత్రుల లేఖలతో కోట్లాది రూపాయల పనులు తీసుకునేందుకు జడ్పీపై ఒత్తిళ్లు తెస్తున్నారు. ఒక్కో ఊరికే రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ పనుల కోసం ద్వితీయశ్రేణి నేతలు లేఖలు తీసుకొని పోతున్నారు. వీటికి నిధులు ఎక్కడ నుంచి తేవాలన్నదే ప్రశ్న. రోడ్లు, కల్వర్టర్లు వంటి పనులు పెట్టారు. పనులు చేపట్టక బిల్లుల కోసం ఒత్తిళ్ళు పెరుగుతాయనే భయంతో పనులను ఆచితూచి మంజూరు చేయాల్సి వస్తోంది. ప్రత్యేక గ్రాంట్లు వుంటే పనులు చేపట్టడానికి వీలుంది.

జడ్పీ సమావేశం బుధవారం నాడు జరగనుంది. ఇక్కడ చర్యంతా అధికారుల పనితీరుపైనే సాగుతోంది. పాలన సమర్థతకు ఇక్కడ జరిగే చర్చలే అద్దం పడతాయి. జడ్పీ ద్వారా జరిగే అభివృద్ధి పనులపై పెద్దగా ఇక్కడ ఎజెండా ఉండదు. ఇతర శాఖలపై చర్చల్లోనే ఆయాశాఖల అధికారుల తీరు పైనే మాట్లాడతారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టే పథకాలు, ఇతర అభివృద్ధి పనులపై చర్చ సాగుతోంది. మండలాల్లో అధికారుల పనితీరు.. సమస్యల పరిష్కారంలో చూపుతున్న శ్రద్ధతో పాటు నిర్లక్ష్యంపైనే ఎక్కువగా సభ్యులు మాట్లాడతారు. అయితే ▶ 2లో


నర్మ'గర్భ' హత్యలు..!

- తల్లి గర్భంలోనే కడతేరిపోతున్న ఆడబిడ్డలు
- గర్భిణులపై ఇంకా కొనసాగుతున్న అత్తారింటి అరాచకాలు
- భ్రూణ హత్యలకు స్కానింగ్ సెంటర్లు కూడా కారణమే..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళుతున్నా కూడా ఆడ శిశువు తల్లి గర్భంలో నుంచి బయటకు రావడానికి మాత్రం చాలా చోట్ల ఇప్పటికీ అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ రోజుల్లో ఆడ, మగ సమానమంటున్నా కూడా ఆడ పిల్ల పుడుతుందంటే జీర్ణించుకోలేని వాళ్లు కుటుంబసభ్యులు ఎంతో మంది ఉన్నారు. పుట్టేది ఆడ బిడ్డో, మగ బిడ్డో స్కానింగ్ సెంటర్ల ద్వారా రహస్యంగా తెలుసుకుంటున్నారు. ఆడపిల్ల పుడుతుందంటే అబార్షన్ చేయించడానికి (భ్రూణ హత్యలకూ) వెనుకాడటం లేదు. ఇంకొందరైతే మరింత క్రూరంగా నాటు పద్ధతులు అవలంబిస్తూ.. గర్భంలో ఆడ శిశువుతో పాటు తల్లిని కూడా బలితీసుకుంటున్న ఘటనలు ఇటీవల చోటుచేసుకోవటం ఆందోళన కలిగిస్తున్నాయి. శిశువుల్లో ఆరోగ్య సమస్యలు కనిపెట్టేందుకు ఏర్పాటవుతున్న స్కానింగ్ సెంటర్లు ఆ శిశువు ప్రాణాలు తీసేందుకు కారణమవుతున్నాయి.

బల్లికురవ మండలం, కొప్పరపాలెంకు చెందిన ఒక యువతిని పల్నాడు జిల్లాకు చెందిన యువకుడికిచ్చి గతంలో వివాహం చేశారు. వీరికి ముందు ఆడబిడ్డ పుట్టగా.. రెండో సారి కూడా ఆడబిడ్డేనని ఓ స్కానింగ్ సెంటర్ ద్వారా తెలిసింది. దీంతో అత్తింటి వారు అబార్షన్ కోసం గడ్డి నివారణ మందును యువతికి తాపించారు. అది వికటించి.. గర్భిణీ వారం రోజుల పాటు వైద్యశాలలో నరకం అనుభవించి.. సోమవారం ప్రాణాలు కోల్పోయింది. భ్రూణహత్యలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. మధ్య తరగతి, సంపన్న కుటుంబాల్లో కూడా స్కానింగ్ ద్వారా పుట్టబోయేది ఆడబిడ్డ అని తెలుసుకుంటున్న అత్తింటి వారు అబార్షన్లు చేయిస్తున్నారు. ప్రైవేటు వైద్యుల సిఫార్సులతో ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు సదరు వైద్యుల మాట కాదనలేక ఎక్కువ డబ్బులు వస్తాయన్న ఆశతో చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి.. భ్రూణ హత్యలకు పరోక్షంగా ▶ 2లో



స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచుతాం..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ



స్కానింగ్ ద్వారా లింగ నిర్ధారణ చేసుకొని.. ఆడ శిశువులైతే అబార్షన్ చేయిస్తున్న ఘటనల నేపథ్యంలో ఇలాంటి దుశ్చర్యలు జరగకుండా స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచుతాం. ఆకస్మిక తనిఖీలు చేస్తాం. వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లను నిరంతరం జరుపుతాం. జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల పరిధిలో మొదటిసారి ఆడపిల్ల పుట్టి.. రెండోసారి గర్భం దాల్చిన గర్భిణులపై మూడు నెలల నుంచి నిరంతర పర్యవేక్షణ జరిపి.. లింగ వివక్ష చర్యలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. ఐసిడిఎస్, అంగన్‌వాడీ, ఎన్జీవోల సహాయంతో గర్భం తీసివేయటం వల్ల వచ్చే దుష్పరిణామాలు గురించి పురుష, స్త్రీ లింగ నిష్పత్తిలో తేడాల వల్ల కలిగే ఇబ్బందుల గురించి ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో అవగాహన చర్యలు చేపడతాం.

ప్రేమి'కుల' ఆత్మహత్య

- పెళ్లికి అంగీకరించని పెద్దలు
- చెట్టుకు ఉరేసుకొని యువ జంట మృతి

ప్రజాశక్తి-అద్దంకి

వారిద్దరి సామాజికవర్గాలూ వేరు కావడంతో పెద్దలు వారి పెళ్లికి అంగీకరించలేదు. కలిసి బతుకుదామని భావించిన ఆ యువ జంట పెద్దల నిర్ణయంతో అది సాధ్యం కాదని.. కలిసి చనిపోదామని భావించారు. ఇద్దరూ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీ సమీపంలోని కాకానికుంట వద్ద మంగళవారం ఉదయం చోటుచేసుకుంది.



ఉరేసుకున్న పెద్దిరాజు, ప్రశాంతి

గరటయ్య కాలనీలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన బత్తుల కష్టారావు కుమారుడు పెద్దిరాజు(22) అద్దంకిలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. స్థానిక పోస్ట్ ఆఫీస్ పక్క బజార్లో నివాసముంటున్న పి.ప్రశాంతి(20) అద్దంకిలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈమెది బలిజ సామాజికవర్గం. పెద్దిరాజు, ప్రశాంతి ఇద్దరూ రెండేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటామని పెద్దలను అడుగుతూ వచ్చారు. కులాలు వేరు కావడంతో పెద్దలు వీరి పెళ్లికి అంగీకరించలేదు. కలిసి ఎలాగూ బతకలేమని.. కలిసైనా చనిపోదామని ఇద్దరూ నిర్ణయించుకొని కాకానికుంట వద్ద మంగళవారం ఉదయం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రేమికులిద్దరి మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

టంగుటూరు : టంగుటూరు పంచాయతీలోని ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని టంగుటూరు సర్పంచి మద్దిరాల మమత జిల్లా పంచాయతీ అధికారి జివి. నారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న ఒ హెచ్ఆర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దాని స్థానంలో 4 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల ట్యాంకు నిర్మాణానికి అనుమతించి నిధులు మంజూరు చేయాలని కోరారు. బుడబుక్కలపాలెం, అరుంధతి నగర్, అంబేద్కర్ నగర్, బాబూజీ కాలనీ, పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీల్లో అంతర్గత రోడ్లు, మురుగు కాలువల మరమ్మతుల ఆవశ్యకత గురించి సర్పంచి అధికారులకు వివరించారు. రామతీర్థం మంచినీటి సరఫరా అయ్యే పైలెట్ ప్రాజెక్టు వద్ద భవిష్యత్తులో వర్షాలు పడినప్పుడు దెబ్బ తినకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీంతో స్పందించిన డిపిఒ నారాయణరెడ్డి మాట్లాడుతూ టంగుటూరు పంచాయతీలోని సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

దోర్నాలలో స్పెయిన్ బృందం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

బుద్ధి మాంద్యం కలిగిన విద్యార్థుల కోసం ఆర్‌డిటి ఆధ్వర్యంలో పాఠశాల, పునరాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించేందుకు స్పెయిన్ బందం మంగళవారం దోర్నాలకు వచ్చింది. ఈ బృందానికి ఆర్‌డిటి డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. బుద్ధి మాంద్యం కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు స్పెయిన్ బందానికి పూలమాలలు వేసి తెలుగు సంప్రదాయంగా హారతి పట్టి బొట్టు పెట్టి స్వాగతించారు. ఆర్‌డిటి సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మంచో ఫెర్రర్ స్పెయిన్ మ్యాంగో ఫౌండేషన్ మరియు సైమన్ డెవలప్మెంట్ ఫౌండేషన్ దాతల సహకారంతో బుద్ధి మాధ్యం కలిగిన చిన్నారుల కోసం పాఠశాల, పునరాస వాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఐడి సెక్టర్ ప్రతినిధి దశరథ రామయ్య మాట్లాడుతూ ఆర్‌డిటి సంస్థ సర్వే చేసి ఇక్కడ బుద్ధి మాధ్యం పిల్లలు ఎక్కువ ఉండటాన్ని గుర్తించినట్లు తెలిపారు. బుద్ధి మాధ్యం కలిగిన పిల్లలకు పాఠశాల, పునరావాస కేంద్రం అవసరమని ఆర్‌డిటి సంస్థ యాజమాన్యంకు వివరించినట్లు తెలిపారు. అందులో భాగంగా ఇక్కడ పాఠశాల, పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఫిక్, డిఐడి సెంటర్ మేనేజర్ షణ్ముఖరావు, అసిస్టెంట్ డైరెక్టర్ యుగంధర్, హ్యాబిటెడ్ సెక్టర్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, మెయింటెనెన్స్ డైరెక్టర్ షేక్ దాదా, టెక్నికల్ డైరెక్టర్ భావనారాయణ, హెల్త్ మేనేజర్ డాక్టర్ సైపులఖాన్, డాక్టర్ వెంకటప్రతాప్, శ్రీశైలం రీజినల్ డైరెక్టర్ పుష్పాలత, ఏరియా టీమ్ లీడర్ నరసింగరావు, శ్రీశైలం రీజినల్ ఇంజినీర్ చంద్రశేఖర్, రీసెర్చ్ అసోసియేట్ రెడ్డప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



దోర్నాలకు వచ్చిన స్పెయిన్ బృందం

స్థలం కొనుగోలు చేసైనా.. పేదలకు పట్టాలిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

డబ్బులు కట్టించుకోవడం ఏంటని ప్రశ్నించారు. తన హయాంలో వేల మందికి పట్టాలు ఇచ్చానని, పదుల సంఖ్యలో కాలనీలు ఏర్పాటయ్యాయని చెప్పారు. ఎవరి వద్ద నుంచీ రూపాయి కూడా తీసుకోలేదని చెప్పారు. 'నీవు ఎప్పుడైనా ఒక్కరికైనా పట్టా ఇచ్చావా..?' అని జనార్ధన్‌ను ప్రశ్నించారు. వెంగముక్కపాలెం రోడ్డులో తన వియ్యంకుడి విల్లాల స్థలం విషయంలో 20 ఎకరాలు ఉంటే మిగిలిన 19 ఎకరాలు తాను బెదిరించి ఇప్పించానని తనపై జనార్ధన్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అక్కడ స్థల యజమానులు వారి స్థలాలు డవలప్‌మెంట్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. మంచి ధర వచ్చినందుకు వారంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. స్థలాల విషయంలో తాను ఎవరితోనైనా మాట్లాడినట్లు నిరూపిస్తే తాను తన పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. ఊరచెరువులో ముస్లిముల ఇళ్లు కూలకొట్టించి వారిని ఇబ్బంది పెట్టిన ఘనత జనార్ధన్‌దే అని చెప్పారు. తన కొడుకు అరాచకాలు చేస్తున్నాడని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఎక్కడ అరాచకాలు చేశాడో నిరూపించాలని సవాల్ విసిరారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న ప్రజా దరణ చూడలేక, తనమీద, తన కుమారుడి మీద నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. మీకు చేతనైతే మీరు ప్రజల్లో తిరిగి వారి ఆదరణను చూరగొనాలని హితవు పలికారు. రిమ్స్ ఆసుపత్రిని ఎంతో అభివృద్ధి చేశామని చెబుతున్నారని, వాళ్ల తాత పేరు మీద వాటర్ ప్లాంటు కట్టించడం తప్ప జనార్ధన్ అక్కడ చేసిందేమీ లేదని బాలినేని వ్యాఖ్యానించారు. రిమ్స్‌ను తీసుకు వచ్చింది తానేనని, ఇప్పుడు ప్రభుత్వం వచ్చిన తరువాత దానిలో ఎంఆర్‌ఐ సేవలు తీసుకువచ్చామని, 100 పడకలు కొత్తగా తెచ్చామని, కరోనా సమయంలో షెడ్‌లు వేసి, ఆక్సిజన్ తెప్పించి ప్రజల ప్రాణాలు కాపాడామని తెలిపారు. కరోనా సమయంలో 'నువ్వు అస్సలు కనపడలేదు' అని జనార్ధన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

నర్మ 'గర్భ' హత్యలు.!

(మొదటి పేజీ తరువాయి)

కారణమవుతున్నారు. స్కానింగ్ సెంటర్‌లపై నిఘా కొరవడటం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994లో రాగా.. మన రాష్ట్రంలో 2001 నుండి అమలులో ఉంది. దీని ప్రకారం ఎవరైనా వైద్యులు గానీ, స్కానింగ్ కేంద్రాల వారు గానీ తమ వద్ద ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎవరికైనా లింగ నిర్ధారణ పరీక్ష చేస్తే వారి మీద చట్టపరమైన అన్ని చర్యలూ తీసుకునేందుకు అవకాశం ఉంది. సదరు డాక్టర్ లేక ల్యాబ్ గుర్తింపును కూడా రద్దు చేయొచ్చు. ఈ కేసులో నేరం రుజువైతే మొదటిసారి ఒక సంవత్సరం నుండి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు రూ.10 వేల వరకు జరిమానా, రెండోసారి నేరం చేస్తే ఐదు సంవత్సరాల వరకు శిక్ష.. రూ.50 వేల వరకు జరిమానా ఉంటుంది. ఆ స్కానింగ్ సెంటర్ గుర్తింపును కూడా చట్టపరంగా రద్దు చేస్తారు. కానీ ఈ చట్టం గురించి అధికారులు పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఈ లింగ నిర్ధారణ పరీక్షలు, గర్భంలోనే ఆడబిడ్డలను కాలరాస్తున్న నేపథ్యంలో స్త్రీ, పురుష నిష్పత్తుల్లో వ్యత్యాసం బాగా పెరిగిపోతోంది. బాపట్ల జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తులను పరిశీలిస్తే ప్రతి వెయ్యి మంది బాలురకు 913 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. ఇది ఎంతో ఆందోళన కలిగించే విషయమని, దీనిని అధిగమించి స్త్రీ, పురుష నిష్పత్తిని సమానం చేయడం కోసం కషి చేయాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

జనరల్ ఫండ్‌తోనే సరి..

(మొదటిపేజీ తరువాయి)

ఏ శాఖలోనూ పనులు చేపట్టేందుకు నిధులు లేవు. అన్నీ నేరుగా సంక్షేమ పథకాల లబ్దిదారులకే నిధులు వస్తున్నాయి. ఈ తరుణంలో జడ్పీ ద్వారా గానీ, ఇతర శాఖల ద్వారా గానీ చేపట్టే పనులేమీ లేవనే చెప్పాలి. శాఖల ద్వారా చేపట్టే పనులు ఎలా జరుగుతున్నాయనే దానిపై చర్చలో మాత్రమే పాల్గొనే అవకాశం తప్ప మరే సమీక్ష చేసే పరిస్థితి కూడా లేదనే చెప్పాలి.

ఇక జడ్పీపై అధికారుల్లోనూ ఉదాసీనత పెరిగింది.గతంలో జడ్పీ అంటే జిల్లా అధికారులే అప్రమత్తంగా ఉండేవాళ్లు. ఇప్పుడా పరిస్థితి లేదు. జడ్పీతో పాటు దిగువస్థాయిలో మండల పరిషత్‌లు కూడా డమ్మీలుగానే మారాయి. ఏది చేపట్టినా జడ్పీ అజమాయిషీతో జరిగేవి. ఇప్పుడు అన్నీ పోయాయి. జడ్పీ విధులు, అధికారాలు కూడా సక్రమంగా అమలు కావడం లేదు. జిల్లా అధికారులు ఈ సమావేశంలో జవాబుదారీగా ఉండేవాళ్లు. ఎమ్మెల్యేలు కూడా సమావేశాలకు ఉత్సాహంగా రావడం లేదు. కారణం ఇక్కడ జరిగే చర్చలకు ప్రాధాన్యత లేదనే భావన వారిలోనూ పెరిగింది. నేడు జరిగే జడ్పీ సమావేశంలో ప్రజా సమస్యలపై సభ్యులు ఏ మేరకు స్పందిస్తారనేదీ చూడాలి.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-రేపల్లె: రేపల్లె మండలం తుమ్మల గ్రామ పంచాయతీలోని ఎస్సార్ నగర్ ఎస్టీ కాలనీలో ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు సరుకులు బుధవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ తుపాకుల దీపిక అధ్యక్షతన గరికపాటి నారాయణ దొర, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అందించిన ఆర్థిక సాయంతో నిత్యావసర సరుకులు అందజేశారు. పనులు లేక, ఆర్థికంగా ఇబ్బంది పడుతూ, ఆకలితో అలమటిస్తున్న నిరుపేద ప్రజలు, రోజువారీ కూలీలకు తమవంతు చేయూతగా ఈ సరుకులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

పాఠశాల నిర్మించారు.. ప్రహరీ మరిచారు

ప్రజాశక్తి-పంగులూరు

ప్రాథమికోన్నత పాఠశాల కోసం మంచి భవనాలు నిర్మించారు.. నాడు-నేడు పథకం ద్వారా విద్యార్థులకు మరుగుదొడ్లు నిర్మించారు.. పాఠశాలకు రంగులు వేసి విద్యార్థులను ఆకర్షించే విధంగా చేశారు.. ఇన్ని చేసిన అధికారులు మా పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించడం మాత్రం మర్చిపోయారు.. దీంతో పాఠశాల స్థలం ఆక్రమణకు గురవుతోంది.. రేపు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి.. దయచేసి అధికారులు మా పాఠశాలకు ప్రహరీ నిర్మించి, పాఠశాల స్థలానికి రక్షణ కల్పించి, పాఠశాల అభివృద్ధికి సహకరించాలి... అని మండలంలోని బయట మంజులూరు గ్రామ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. ఈ గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల ఊరికి దక్షిణం వైపున, గ్రామం చివరన పాఠశాల ఉంది. ఈ పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడం వలన, ఇటీవల కాలంలో కొంతమంది కొంత ఆక్రమణలకు గురిచేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పాఠశాలలో విలువైన వస్తువులు ఉన్నందువలన ఎప్పుడు ఏ దొంగతనం జరుగుతుందోనని ఉపాధ్యాయులు కూడా ఆందోళన చెందుతున్నారు. మందుబాబులు పాఠశాలను తమ అడ్డాగా మార్చుకొని, అక్కడే మద్యం సేవించి, మద్యం సీసాలు అక్కడే వేస్తున్నారు. పాఠశాలలోకి పశువులు, పందులు, యథేచ్ఛగా వస్తున్నాయి. వీటన్నిటి నుంచి రక్షణ కలిగించాలంటే పాఠశాలకు తక్షణమే ప్రహరీ కూడా నిర్మించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువస్తున్నామని, అధికారులు స్పందించి ప్రహరీ కూడా నిర్మించాలని, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ చక్రవరం చిన అంజంరాజు కోరుతున్నారు.



ప్రహరీ గోడ లేని బయటమంజులూరు ప్రాథమికోన్నత పాఠశాల

రెండిళ్లలో చోరీ

ప్రజాశక్తి-దరిశి

దరిశి నగర పంచాయతీలోని శివరాజ్‌నగర్‌లో ఆదివారం రాత్రి రెండు ఇళ్లలో మనుషులు లేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి 3 సవర్ల బంగారం, రూ.8 వేల నగదును దొంగిలించారు. ఆదివారం రాత్రి రెండు కుటుంబాల వారు శ్రీశైలంగా వెళ్లగా ఆ రాత్రికే ఇంటి తాళాలు దొంగలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. మంగళవారం వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

మొక్కల పెంపక కేంద్రం సందర్శన

ప్రజాశక్తి-చీరాల

అవగాహనాభివృద్ధికి క్షేత్ర పర్యటనలు ఎంతగానో ఉపకరిస్తాయని బాపట్ల జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి అన్నారు. మంగళవారం వివిధ పాఠశాలల్లో చదువుతున్న 40 మంది విద్యార్థులను కేస్ స్టడీలో భాగంగా క్షేత్ర పర్యటన నిమిత్తం లక్ష్మీ పురంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి వారి మొక్కల పెంపక కేంద్రాన్ని విద్యార్థులు సందర్శించారు. విత్తనాలు ఎక్కడ నుంచి తెస్తారు? మొక్కలు పెంచే విధానం ఏమిటి? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్వయంగా చూసి, మరికొన్ని అడిగి తెలుసుకున్నారు. మొక్కల పెంపకం విధానాన్ని, వివిధ దశలను అడిగి తెలుసుకొని సమాచారాన్ని సేకరించారు. పిల్లల్లో వాస్తవిక సమాచార సేకరణ, సైన్స్ పట్ల, సమాజం పట్ల అభిరుచిని పెంపొందించేందుకు ఇలాంటి క్షేత్ర పర్యటనలు దోహదపడతాయని అన్నారు. ప్రత్యక్షంగా చూడటం ద్వారా సులభంగా విషయ పరిజ్ఞానం అలవడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో కలసి ఉపాధ్యాయులు వన భోజనాలు చేశారు. చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. చెన్నై కి చెందిన ప్రిపేర్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ వినూత్న కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శవనం చంద్రారెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు నాగేంద్రరావు, మద్దిన వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీని బలోపేతం చేయాలి: ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-బాపట్ల రూరల్



జిల్లా అధ్యక్షుడు ముప్పంగి కుమార్

బాపట్ల జిల్లా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఏపీఎస్ఆర్టీసీ బాపట్ల జిల్లా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రథమ జిల్లా మహాసభ మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ముప్పంగి కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు రవిశంకర్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రభుత్వ రంగంలో బలోపేతం చేయాలని హైర్ బస్సుల్ని కాకుండా ప్రభుత్వమే బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీలో నడపాలని కోరారు. ఆర్టీసీ సిబ్బందికి సంబంధించి పెండింగ్లో ఉన్న అన్ని సమస్యల్ని పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల ఆర్థికపరమైన అన్ని సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ అన్ని హాస్పిటల్స్‌లో మందుల కొరత లేకుండా చూడాలని కోరారు. ఆర్టీసీ నాయకులు పి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉద్యమాలు చేసి హక్కులు సాధించుకోవాలని కోరారు. ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ మహాసభలో బాపట్ల డిపో మేనేజర్ డీ శ్రీనివాస్‌రెడ్డి హాజరై కార్మికులు కష్టపడి పనిచేసి సంస్థకు మంచిపేరు తేవాలని కోరారు. అనంతరం మహాసభ బాపట్ల జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసుకుంది. నూతన జిల్లా అధ్యక్షులుగా ముప్పంగి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పి తిరుపతిరెడ్డి, జిల్లా కోశాధికారిగా బి శ్రీనివాసరావు, జిల్లా ప్రచార కార్యదర్శిగా వి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.



ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రదర్శన



జిల్లా ప్రధాన కార్యదర్శి పి తిరుపతిరెడ్డి

సూపర్‌స్టార్ కృష్ణకు నివాళి

ప్రజాశక్తి-అద్దంకి

తెలుగు చిత్ర పరిశ్రమ సీనియర్ నటుడు, సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ మృతి పట్ల దాస భారతీయ జానపద కళాక్షేత్రం అద్దంకి పట్టణ అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులో గల అన్నమాచార్యుల వారి విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ప్రముఖ నటుడు పద్మభూషణ్ కృష్ణ చిత్రపటానికి కృష్ణతో పరిచయం ఉన్న మోటుపల్లి కోటేశ్వరరావు, అద్దంకి మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, పూల దండలు వేసి నివాళి అర్పించారు. చెన్నుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కృష్ణ చిత్ర పరిశ్రమలో, రాజకీయ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఘంటసాల గాన భారతి అధ్యక్షుడు మోటుపల్లి రామదాసు కృష్ణ 350 సినిమాలలో నటించి సింహాసనం అంత ఎత్తుకు ఎదిగారన్నారు. జానపద కళాపీఠ అధ్యక్షుడు, యు దేవపాలన, జేమ్స్ బాండ్‌గా, కౌబాయ్‌గా, అభిమానుల గుండెల్లో నిలచారని అన్నారు. కృష్ణ గురించి వారనాసి రఘురామశర్మ, జాషువా సంఘం అధ్యక్షుడు పిసిహెచ్ కోటయ్య, చెన్నుపాటి రామాంజనేయులు, తాళ్ళూరి బాబురావు, డివిఎం సత్యనారాయణ, మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ, మలాది శ్రీనివాసరావు, చెన్ను పల్లి పవన్, గొల్లపూడి గోపిచంద్ పాల్గొన్నారు.

కర్లపాలెం: సినీ రంగంలోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పాటు చేసుకుని ఎన్నో సాహసాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన సూపర్ స్టార్ కృష్ణ మరణం సినీ పరిశ్రమకు తీరని లోటని కర్లపాలెం మండల కృష్ణ- మహేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హక్ తెలిపారు. సూపర్ స్టార్ కృష్ణ మృతి పట్ల కర్లపాలెం సెంటర్లో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు, రాజకీయవేత్త జయ భారత్ రెడ్డి మాట్లాడుతూ తన చలనచిత్రాల ద్వారా గొప్ప సందేశాలను సమాజానికి అందించి ఎంతోమంది యువతకు మార్గ నిర్దేశం చేసిన గొప్ప నటుడు సూపర్ స్టార్ కృష్ణ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కూచిపూడి సామెల్ జాన్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి 12 గొర్రెలు మృతి

ప్రజాశక్తి- మద్దిపాడు

రసాయనాలు కలిసిన కలుషిత నీటిని తాగి 12 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద చేసుకుంది. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పి. రామారావు కథనం ప్రకారం.. మండల పరిధిలోని బూరేపల్లి గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన కన్నెబోయిన నాగరాజుకు చెందిన గొర్రెలు మేత కోసం అన్నంగి కొండ వద్దకు వెళ్లాయి. ఆ సమయంలో గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని రసాయనాల పరిశ్రమ నుంచి నీటి గొర్రెలు తాగాయి. దీంతో 12 గొర్రెలు మృతి చెందాయి. అన్నంగి విఆర్ఎ ఈ విషయాన్ని గమనించి గొర్రెల పెంపకందారుడికి తెలిపారు. గొర్రెల మృతి గురించి తెలుసుకున్న డాక్టర్ రామారావు, డాక్టర్ మాధవి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బేబీ రాణి కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన గొర్రెలకు బీమా పరిహారం వర్తింపజేస్తామని తెలిపారు.

అధికారులు, బిఎల్‌వోల సమన్వయలోపం

- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు
- ఆందోళనలో ఎంఎల్‌సి ఓటు దరఖాస్తుదారులు

ప్రజాశక్తి-వేటపాలెం

ఎంఎల్‌సి ఓటర్ల అప్లికేషన్ వెరిఫికేషన్‌లో స్థానిక అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా అధికారులు ఇచ్చిన గైడ్‌లైన్స్ కూడా పెడచెవిన పెడుతున్నారు. తాము అడిగిన ప్రూఫ్స్ చూపాల్సిందే, లేకుంటే మీకు ఓటు రాదు అంటూ దరఖాస్తుదారులను చిన్న చూపు చూస్తున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో బిఎల్‌ఓలు విచారణకు రాకుండానే సచివాలయంలో కూర్చొని ఫోన్లు చేసి దరఖాస్తుదారులను ప్రూఫ్స్ తీసుకోని రావాలని ఆదేశిస్తున్నారు. చేసేది లేక దరఖాస్తుదారులు పనులు మానుకొని సచివాలయాలకు వెళుతున్నారు. మరి కొందరైతే ఓటు వద్దు ఏమి వద్దు మీఇష్టం వచ్చినట్లు చేసుకోండి అంటూ మిన్నకుండిపోతున్నారు. ఇలానే జరిగితే ఓటర్ల నమోదు తగ్గుముఖం పడుతుందని మేధావి వర్గం అంటోంది. ఓట్ల వెరిఫికేషన్ తేదీ ఈ నెల 19తో ముగియనున్నది. స్థానిక అధికారులు, బిఎల్‌ఓల సమన్వయం లేకపోవడంతో తమకు ఓటు హక్కు వస్తుందా, రాదా అనే మీమాంసలో దరఖాస్తుదారులు గందరగోళానికి గురవుతున్నారు. త్వరలో జరగనున్న తూర్పురాయలసీమ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లుగా నమోదుకు అక్టోబర్-1వ తేదీ నుంచి నవంబర్ 7వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలోనే వేటపాలెం మండలంలో సుమారు మూడు వేల మంది గ్రాడ్యుయేట్ ఓటుకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆఫ్‌లైన్ ద్వారా నమోదుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఓటును ఇవ్వాలి. ఇందుకు భిన్నంగా వేటపాలెం లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తేడా లేకుండా అన్నింటినీ కలిపి సచివాలయాలకు పంపినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయాల్లో బిఎల్‌ఓలు మరలా వెరిఫికేషన్ పేరుతో అర్జీదారులకు ఫోన్ చేసి ఒరిజినల్ సర్టిఫికెట్స్, డేటాఫ్ బర్త్ సర్టిఫికేట్, ఐడి ప్రూఫ్స్ తీసుకురావాలని ఒత్తిడి చేస్తున్నారు. వాస్తవానికి ఆన్‌లైన్ దరఖాస్తులకు మాత్రమే బిఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి సర్టిఫికెట్స్ వివరాలు పరిశీలించాలి. ఇందుకు సంబంధించి జిల్లా అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఇవేవీ పట్టించుకోకుండా స్థానిక అధికారులు ఇష్టారీతిన వ్యవహరించడం పట్ల వివిధ ప్రజాసంఘాల నాయకులు తప్పుపడుతున్నారు. మండల పరిధిలో గత కొన్నాళ్లగా పనిచేస్తున్న పాత బిఎల్‌ఓలను మార్చి కొత్త వాళ్లను నియమించటం వలన వారి అవగాహనా లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోందనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వేటపాలెంలో జరుగుతున్న వెరిఫికేషన్‌పై దృష్టి సారించి స్థానిక ఎంఎల్‌సి ఓటు కోసం దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు ఓటు హక్కు కోల్పోకుండా చూడాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తుదారులను ముప్పుతిప్పలు పెడుతున్నారు

నలతోటి బాబురావు, సిఐటియు జిల్లా నాయకులు



అధికారులు, బిఎల్‌ఓల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎంఎల్‌సి ఓటుకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులను ముప్పుతిప్పలు పెడుతున్నారని అన్నారు. అధికారులు గైడ్‌లైన్స్ పాటించకుండా ఇష్టారీతిన వ్యవరించడం విడ్డూరంగా వుందని అన్నారు. ఈ నెల 19వ తేదీతో వెరిఫికేషన్ పూర్తికానున్నందున ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఎంఎల్‌సి ఓటు దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని కోరారు.



విజేతలను అభినందిస్తున్న యూనివర్సల్ చైర్మన్ ఆర్‌కె

టెన్నిస్ పోటీల్లో యూనివర్సల్ క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో ఇంకొల్లు మండలం పూసపాడు యూనివర్సల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలలో గుంటూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జట్టులో యూనివర్సల్ హైస్కూలు విద్యార్థులు వి రవికిరణ్, కె ప్రణీత్‌లు ఆడి జట్టు విజయానికి కృషి చేశారు. ఈ సందర్భంగా విజేతలను పాఠశాల చైర్మన్ పేర్ని రాధాకృష్ణమూర్తి (ఆర్‌కె), డైరెక్టర్ పేర్ని సతీష్‌చంద్ర అభినందించారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జాతీయ కరాటేలో అల్లూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచారు. నవంబర్6వ తేదీన మంగళగిరిలో జరిగిన నేషనల్ ఇన్విటేషనల్ కరాటే పోటీల్లో నాలుగు బంగారు, ఒక వెండి పతకాలు సొంతం చేసుకున్నారు. 10వ తరగతికి చెందిన మేరుగ కోటి, ఎల్లావుల మురళి, 7వ తరగతికి చెందిన దుర్గానాథ్‌రెడ్డి, 8వ తరగతికి చెందిన భానుప్రకాష్‌రెడ్డి బంగారు పతకాలు సాధించగా 9వ తరగతికి చెందిన సుబ్రహ్మణ్యం వెండి పతకం సాధించి తమ పాఠశాల కీర్తి పతాకాలు నలుమూలలా వ్యాప్తి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సునీత తదితరులు విద్యార్థులను అభినందించారు.



బోధన పరికరాల ప్రదర్శనలో పాల్గొన్న అతిథులు

ఆకట్టుకున్న బోధన పరికరాల ప్రదర్శన

ప్రజాశక్తి-రేపల్లె

స్థానిక పెనుమూడు రోడ్‌లోని రామకృష్ణ విద్యా నిలయం ఓల్డ్ టౌన్ స్కూల్ వారు వేణుగోపాల స్వామి కళ్యాణ మండపంలో విద్యార్థులకు బోధన పరికరాలపై ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన విద్యార్థుల మేధస్సును పెంచేవిధంగా ఉందని బసవయ్య నాగేంద్రమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లూరిపాలెం గ్రామానికి చెందిన యలవర్తి వెంకటరావు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన బోధనా పరికరాలను చూసి ఆయన విద్యార్థులను అభినందించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అతిథులను ఆకట్టుకున్నాయి. అనంతరం రామకృష్ణ విద్యా నిలయం నూతన భవనాలను నిర్మాణ పనులను అతిథులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యలవర్తి వెంకటరావు కూతురు సుష్మ (సైంటిస్ట్, అమెరికా) అల్లుడు నినాద్ (సైంటిస్ట్ అమెరికా), ఆలపాటి శివ శంకర్‌రావు, కాలేపల్లి ఈశ్వరబాబు, రమాదేవి, ఇండూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి-భట్టిప్రోలు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

డెల్టా ప్రాంతంలో వరి పంట రైతుల చేతికందే సమయం ఆసన్నమైన దృష్ట్యా ప్రభుత్వం ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాల సౌకర్యాలు సిద్ధం చేయాలని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం సిపిఎం, రైతు సంఘం నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ఏడాది కూడా రైతుభరోసా కేంద్రాల ద్వారా పండిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. మిలర్లు రైతుల మధ్య మధ్యవర్తిత్వం నిర్వహించింది తప్ప ఎక్కడా కొనుగోలు చేపట్టలేదన్నారు. దీనివలన మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు సాకుగా చూపి విరుగుడు, నెమ్ము శాతం నాణ్యత లోపం పేరుతో ధరలో కోత విధించి రైతులకు గిట్టుబాటు ధర రాకుండా నష్టాలపాలు చేసిందన్నారు. అంతేకాక ధాన్యం అమ్ముకున్న రైతుల ఖాతాలో సొమ్ము జమ చేయటంలో జాప్యం చేసిందన్నారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఈ ఏడాది ముందుగానే రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం సంచులు సిద్ధం చేయాలని, గిడ్డంగుల ఏర్పాటుతో పాటు ప్రస్తుతం ప్రకటించిన గిట్టుబాటు ధర రూ.2,060ను కేరళ రాష్ట్రంలో అందిస్తున్న మాదిరిగా క్వింటా ధరను రూ.2,800కు పెంపుదల చేయాలని, కొనుగోలులో ఉన్న నిబంధనలు తొలగించాలని డిమాండ్ చేశారు. పెరిగిన వ్యవసాయ ఖర్చులతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా సాగు రైతులకే అందేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, మండల కార్యదర్శి జి సుధాకర్, ఎం సత్యనారాయణ, కె రామస్వామి, జి నాగరాజు, బసవకోట్లు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్

సీఈసీ విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-చీరాల

ఎన్‌సీసీ, వాలీబాల్ క్రీడల్లో చీరాల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఐ లీలా ప్రసాద్ బంగారు పతకం దక్కించుకున్నాడు. ఈ నెల ఏడు నుంచి 14 వరకు కావలిలో జరిగిన ఎన్‌సిసి ఇంటర్ గ్రూప్ వాలీబాల్ పోటీల్లో చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి బెటాలియన్ల తరఫున క్రీడాకారులు పాల్గొన్నారు. 23 ఆంధ్ర బెటాలియన్ నుంచి చీరాల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రసాద్ పాల్గొన్నారు. ఈ జట్టు టోర్నమెంట్ విజేతగా నిలవడంతో ప్రసాద్‌కు బంగారు పతకం దక్కింది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి రవికుమార్ మాట్లాడుతూ ఎన్‌సిసిలో తమ విద్యార్థులు వరుసగా పతకాలు సాధించటం హర్షణీయమన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

తెలుగు మహిళ డిమాండ్

ప్రజాశక్తి-బాపట్ల రూరల్



మాట్లాడుతున్న మహిళా నాయకులు

మహిళలపై పెరిగిపోతున్న దాడులు, ఆరాచకలను ప్రజలకు వివరించడానికి బాపట్ల పార్లమెంట్ తెలుగు మహిళ విభాగం ఆధ్వర్యంలో తలపెట్టిన మాట మంతి కార్యక్రమం మంగళవారం బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ ముఖ్య అతిథిగా పాల్గొని తెలుగు మహిళ నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి కృషి చేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. నాడు పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమానవాటా వంటి సంచలనాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో సున్నా వడ్డీ రుణాలు, స్వయం సహాయక బృందాలకు ఆర్థిక తోడ్పాటు, డ్వాక్రా సంఘాలు వంటి విప్లవాత్మక చర్యలు చేపట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని పేర్కొన్నారు. రోజురోజుకూ అత్యాచారాలు, దాడులు పెరిగి పోయాయని అన్నారు. బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకు తెలుగు మహిళలు పోరాడి వారికి అండగా నిలవాలని నరేంద్ర వర్మ పిలుపునిచ్చారు. బాపట్ల పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు పథ్వీలత మాట్లాడుతూ తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత పిలుపు మేరకు బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మాటామంతి కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. మాటామంతి కార్యక్రమం ద్వారా తెలుగు మహిళలు ప్రజల్లోకి వెళ్లి వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వాస్తవాలను వివరిస్తామని అన్నారు. మద్యపాన నిషేధం హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి నేడు మద్యమే ప్రధాన ఆదాయ వనరుగా చేసుకొని మోసం చేశారు. నాసిరకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ మహిళల తాళిబొట్లు తెంచుతున్న దుర్మార్గ పాలన నడుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రం తిరిగి గాడిన పడాలంటే చంద్రబాబు నాయుడు పాలన తిరిగి రావాలని కోరారు. ఆ ఆవశ్యకతను మహిళలకు వివరించి వారి మద్దతు తెలుగుదేశం పార్టీకి తీసుకురావడానికి తెలుగు మహిళలు కృషి చేస్తామని పృథ్వీలత తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు పృథ్వీలత, ఏడు నియోజకవర్గాల తెలుగు మహిళ అధ్యక్షురాళ్లు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి గ్రామాభివద్ధికి కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో స్థానిక సమస్యలపై పార్టీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వం దష్టికి తీసుకురావాలని కార్య కర్తలకు పిలుపునిచ్చారు. ఇటీవల కురిసిన వర్షానికి గ్రామాల్లోని రోడ్లు డ్రైనేజీలు దెబ్బతిన్నాయని వాటికి వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించాలనే ఆలోచనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములను పేదలకు పంచాలన్నారు. గిద్దలూరు ప్రాంతంలో మిగులు భూమి చాలా ఉందని దాన్ని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి. తిరుపతిరావు, స్థానిక సిపిఎం నాయకులు టి.ఆవులయ్య, థామస్, నరసింహులు, రాజశేఖర్, బి. పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి


సబ్ కలెక్టర్ మాధవన్‌కు నాయకుల వినతి

ప్రజాశక్తి-మార్కాపురం

త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి గ్రామ పంచాయతీలోని నర్సింగపురం రెవెన్యూలో పరిధిలోని 120 ఎకరాల భూమిలో పలువురు రైతులు 50 సంవత్సరాలకు పైగా సాగు బడిలో ఉన్నారని, వారందరికీ హక్కులు కల్పించేలా న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. అక్కడి రైతుల పూర్వీకులు కొనుగోలు చేసిన భూములను అప్పట్లో తెల్లకాగితంపై స్వాధీనపు ఖరార్లు రాసుకున్నట్లు ఎలిపారు. సాదాబైనామా అగ్రిమెంట్లు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా జీవో నెంబర్ 661ని విడుదల చేసినట్లు తెలిపారు. ఆ జీవో అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రైతులు అనుభవంలో ఉన్న భూములను అక్రమార్కులు హక్కులు పొందారని, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

నగర అధ్యక్ష, కార్యదర్శులుగా శశాంత్, హేమంత్


శశాంత్


హేమంత్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర అధ్యక్ష, కార్యద ర్శులుగా శశాంత్, హేమంత్ ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర మహాసభ ఎల్‌బిజి భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు నగర నూతన కమిటీని మంగళవారం ఎన్ను కున్నారు. అధ్యయనం, పోరాటం నినాదంతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాల కోసం ఎస్ఎఫ్ఐ నిబంధన లను పాటిస్తూ ఈ కమిటీ పని చేస్తుందని తెలిపారు

మహాసభ ఆమోదించిన తీర్మానాలు

పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని తీర్మానించారు. శాశ్వత ట్యూటర్స్‌ను ఏర్పాటు చేయాలని, ఒంగోలు గవర్నమెంట్ జూనియర్ కాలేజీకి సొంత భవనాన్ని నిర్మాంచాలని తీర్మానించారు. జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ ,ట్రిపుల్ ఐటీలకు నిధులను కేటాయించి, సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని పాటించాలి, అందు కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. విద్యా దీవెన, వసతి దీవెన ఫీజులను సకాలంలో విడుదల చేయాలని, కెజిబివి పాఠశాలకు పెండింగ్‌లో ఉన్న కంటెంజెంట్ నిధులను విడుదల చేయాలి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని తీర్మానించారు. జీవో నెంబర్ 77 రద్దుచేసి పీజీకి రీయింబర్స్‌మెంట్స్ కల్పించాలని, ఐటిఐ , నర్సింగ్, బిఇడి కాలేజీలపై పర్యవేక్షణ సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఈ తీర్మానాల అమలుకై ఉద్యమాలు ,పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. మహాసభలో జిల్లా కార్యదర్శి సిహెచ్. వినోద్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి

ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసుపై వివరాల సేకరణ


శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

శింగరాయకొండ : మండల పరిధిలోని పాత శింగరాయ కొండ పంచాయతీ లోని బాలిరెడ్డి నగర్ గిరిజనుల శ్మశానవాటిక స్థలాన్ని ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ డిఎస్‌పి రామకష్ణ మంగళవారం పరిశీలించారు. శ్మశాన వాటిక విషయంలోపై గిరిజనులపై దాడికి పాల్పడిన షేక్ చాంద్‌బాషాపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ నమోదు చేశారు. తొలుత డిఎస్‌పి రాకమకృష్ణ బాలిరెడ్డి నగర్‌లోని గిరిజనుల శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. రెవెన్యూ అధికారులు రికార్డుల ప్రకారం అది ప్రభుత్వ భూమని వివరించారు. భూమి తనదని అడ్డుకున్న చాంద్ బాషా పై ఫిర్యాదు చేసిన పొట్లూరి లక్ష్మయ్య, ఏలూరు శ్రీనివాసులు, బిందుశ్రీ , కోడూరు నాంచార్లుతో డిఎస్‌పి మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుడు చాంద్ బాషాను పోలీసులు సోమవారం అదుపులోకి వదిలేసినట్లు తెలిపారు. దీంతో పోలీసులు తీరుపై అనుమానాలు ఉన్నాయని గిరిజన సంఘం నాయకులు డిఎస్‌పి తెలిపారు. కేసును నమోదు చేసి విచారణ ప్రారంభించామని బాధితులకు తప్పక న్యాయం చేస్తామని డిఎస్‌పి తెలిపారు. డిఎస్‌పి వెంట సింగరాయకొండ సిఐ రంగనాథ్, ఎస్ఐ ఫిరోజా ఫాతిమా, కొండపి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి, ఎంఆర్‌పిఎస్ నాయకులు రావినూతల కోటి, రేణుమల మాధవ, మాల మహానాడు నాయకులు చొప్పర వెంకన్న , దళిత. గిరిజన నాయకులు ఉన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి- ముండ్లమూరు

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 2020 - 21, 21-22 ఆర్థిక సంవత్సరాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి సుంకర సునీత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌పిలు పంచాయతీ వారీగా నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి నాగమల్లి అంకమ్మరావు మాట్లాడుతూ ఈదర పంచాయతీలో ఉద్యోగులు, అంగన్‌వాడీలు, లండన్‌లో ఉన్న ఓ వ్యక్తి ఉపాధి పనులు చేసినట్లు హాజరు వేసి నగదు చెల్లించినట్లు తెలిపారు. దీంతో స్పందించిన పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ లిఖిత పూర్వంగా ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. మారెళ్ళ పంచాయతీలో ఉపాధి పనులు చేయని వారికి మస్టర్ వేసినట్లు గ్రామ సర్పంచి గోపనబోయిన వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయమై విచారణ జరపాలని ఏపీడీ పద్మశ్రీని పీడీ ఆదేశించారు .కార్యక్రమంలో అబుడ్స్‌మెన్ మీరావలి, విజిలెన్స్ అధికారి వెంకటస్వామి, ఎస్ఆర్‌పి మాధవరావు, జడ్‌పిటిసి రత్నరాజు, ఎపిఒ కొండయ్య, వెంకట్రావు ఇసి ఈశ్వరి దేవి, ఉపాధి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాలినేనిని కలిసిన విశ్వబ్రాహ్మణులు


బాలినేనినితో విశ్వబ్రాహ్మణులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

జిల్లాలోని పలువురు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డిని మంగళవారం కలిశారు. విశ్వ బ్రాహ్మణులకు సంబంధించిన పలు అభివృద్ధి పనులు, సమస్యల గురించి ఆయనతో చర్చించారు. విశ్వ బ్రాహ్మణుల కార్తీక వన సమారాధన, వనభోజనాలకు ఆహ్వానించేందుకు వచ్చినందుకు గాను వారి కృతజ్ఞతలు తెలిపారు. బాలినేనిని కలిసిన వారిలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రత్తిపాటి బాల బ్రహ్మాచారి, ప్రముఖ వాస్తు జ్యోతిష్య సిద్ధాంతి ఫణిదపు బ్రహ్మయ్య, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేల్పూరి రామారావు, విశ్వబ్రాహ్మణ ఉద్యోగస్తుల సంఘం నాయకులు రావినూతల నాగేశ్వరరావు, ఒంగోలు నగర గౌరవాధ్యక్షుడు ఖనాల వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.


భజన పాటలు పాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

పడి భజనలో బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని పొదిలి రోడ్‌లోనున్న శ్రీకర ఫంక్షన్ హాలు వద్ద సోమవారం రాత్రి దుగ్గిరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ భజన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని అయ్యప్పస్వామి పాటలు పాడి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అచ్యుత కొండలు, శివకోటిరెడ్డి, సత్యనారాయణ, దుగ్గిరెడ్డి బ్రదర్స్ పాల్గొన్నారు.

కృష్ణ మృతికి మాగుంట సంతాపం

ఒంగోలు కలెక్టరేట్ : వివిధ రకాల వైవిధ్యమైన పాత్రలతో అందరినీ మెప్పించి సూపర్ స్టార్‌గా ఎదిగి వందలాది చిత్రాలలో నటించిన సినీ హీరో కష్ణ అకాల మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సూపర్ స్టార్ లేని లోటు తీరనిది : బాలినేని

సినీ నటులు, సూపర్ స్టార్ కష్ణ లేని లోటు తీరనిదని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. హీరో కష్ణ హఠాన్మరణం సినీ ప్రపంచానికి తీరని లోటని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబసభ్యులకుతన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

శరత్ బాబుకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్ : ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ మూన్ లైట్ మ్యూజిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగర్స్ మీట్ సందర్భంగా ప్రజా గాయకుడు నూకతోటి శరత్ బాబును ఘనంగా సత్కరించారు. విజయవాడలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు జ్యోతిర్మయి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గాయని గాయకులు హాజరయ్యారు. పాత కొత్త చిత్రాలకు సంబంధించి అనేక మధుర గీతాలను ఆలపించారు. త్వరలో ఇలాంటి గాయకుల సమూహ సమ్మేళనాలు హైదరాబాద్, వైజాగ్‌లో నిర్వహించ నున్నట్లు జ్యోతిర్మయి తెలిపారు.

ఎస్‌పికి అభినందనలు

ఒంగోలు కలెక్టరేట్ : ఎస్‌సి,ఎస్‌టి స్పెషల్ గ్రీవెన్స్ సెల్ నిర్వహించిన ఎస్‌పి మల్లిక గర్గ్‌కు దళిత నేత నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలియజేశారు ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ గ్రీవెన్స్ సెల్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎస్‌పి కలిసి అభినందించారు. ఎస్‌పిని అభినందించిన వారిలో మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సజన్ మాదిగ, డప్పు చర్మకారుల రాష్ట్ర నాయకులు జంగ్రాజుపల్లి ఆంజనేయులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, ఆనంద్ ఉన్నారు

తీరంలో పోలీసుల గస్తీ

కొత్తపట్నం : కొత్తపట్నం మెరైన్ స్టేషన్ పరిధిలోని 70 కిలోమీటర్ల పరిధిలోని సముద్ర తీరంలో మంగళవారం ,బుధవారాల్లో ఉగ్రవాదులు, తీవ్రవాదులు బందిపోటు దొంగలు రాకుండా పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నట్లు నోడల్ ఆఫీసర్ ఎఆర్ డిఎస్‌పి రాఘవేంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తపట్నం ,నాగులుప్పలపాడు మండలాలలో సుమారుగా 85 మంది పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం మెరైన్ సిఐ కె. శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటేశ్వరరావు ,లా అండ్ ఆర్డర్ ఎస్ఐ మధుసూదన్ రావు, సిఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రజల సమస్యల పరిష్కారానికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి తెలిపారు. మండలపరిధిలోని నాయుడుపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందని అర్హులు ఉంటే తమ దష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. అదే విధంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, ఎంపిపి పోరెడ్డి అరుణచెంచిరెడ్డి, ఎంపిడిఒ తోట చందన, తహశీల్దారు శ్రీనివాసరావు, నాయడుపల్లి గ్రామ సర్పంచి మోడీ అరుణ, శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి షేక్ కాశిం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **గిద్దలూరు :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మెహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని కొంగలవీడు రోడ్డు సచివాలయం పరిధిలోని 13 వ వార్డులో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వైసిపి నాయకులు,




గిద్దలూరులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా



మార్కాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

కార్యకర్తలు,అభిమానులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారన్నారు. కుల,మతాలు పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి వైసిపి పాలనలో ఆర్థిక భరోసా కల్పించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్లు ఆర్‌డి.రామకష్ణ, కాతా దీపికా, మాజీ ఎంపిపి వంశీధర్ రెడ్డి, వైసిపి నాయకులు బత్తెం ఓబుళరావు, పాముల శ్రీకాంత్ యాదవ్, సాధు సుధాకర్, బెల్లం రమాదేవి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. పాత శింగరాయకొండ సచివాలయ పరిధిలోని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు అశోక్ బాబుకు ఘన స్వాగతం పలికారు. తొలుత అశోక్‌బాబు శ్రీ వరహాల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ నగర్‌లోని



శింగరాయకొండలో మాట్లాడుతున్న అశోక్‌బాబు

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఒంగోలు పార్లమెంట్ వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి ,ఎంపిపి కట్ట శోభారాణి, వైస్ ఎంపిపిలు షేక్ షకీల ,సామంతుల రవికుమార్ రెడ్డి, సర్పంచి వల్లూరి రాజ్యలక్ష్మి , తాండ్ర రామ్మూర్తి, చిమట శ్రీనివాసరావు, గాలి నరసింహారావు ,గాలి బాలాజీ ,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి ,డిప్యూటీ తహశీల్దారు తన్నీరు వెంకటేశ్వర్లు, సచివాలయ కార్యదర్శి సింగరాజు ,మారుతీరావు పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు** : ప్రతికుటుంబానికి ఆర్థిక చేయూనందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే సుధాకర్ బాబు తెలిపారు. మద్దిరాలపాడు సచివాలయ పరిధిలోని చేకూరపాడులో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రలజ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వసంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. ఈకార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, నాయకులు కూనం పూర్ణచంద్రరావు, మారెడ్డి వీరారెడ్డి, పి.శ్రీమన్నారాయణ, యు. శ్రీనివాస ప్రసాదు, యర్రా దశరథ, పూజల చంద్రయ్య, పాల్గొన్నారు.

'కొమ్మాలపాటి'కి పితృవియోగం

ప్రజాశక్తి - పామూరు



రోశయ్య(ఫైల్)

సిపిఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రికి పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి కొమ్మలపాటి రోశయ్య (76) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. రోశయ్యకు ఉదయం 6 గంటల సమ యంలో గుండెపోటు రావడంతో ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తెలిపారు. రోశయ్య మృతదేహాన్ని స్వగ్రామమైన కంభాలదిన్నెకు తరలించారు. బుధవారం ఉదయం 10 గంటలకు రోశయ్య అంత్య క్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు మాల్యాద్రి తెలిపారు.

విద్యా కమిటీ రద్దు

ప్రేజాశక్తి - కురిచేడు

కురిచేడులోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యా కమిటీని రద్దు చేసినట్లు ఎంఇఒ ఆర్. వస్త్రాం నాయక్ తెలిపారు. ఎంఇఒ కథనం ప్రకారం... గత శుక్రవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కురిచేడు మండలంలో విస్తృత పర్యటించారు. ఆ సమయంలో కస్తూరిబా గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడి సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా కమిటీ ఎన్నిక సక్రమంగా లేదని, దాన్ని రద్దు చేసి నూతన కమిటీని ఏర్పాటు ఏర్పాటు చేయాలని విద్యాశాఖాధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. అందులో భాగంగా విద్యాకమిటీని రద్దు చేసి నూతన విద్యా కమిటీ ఎన్నికకు ప్రతిపాదనలు సిద్ధం చేసి డిఇఒకు పంపినట్లు ఎంఇఒ తెలిపారు.

మిర్చి రైతులకు 'తోటబడి'

ప్రజాశక్తి- సంతనూతలపాడు

మిరపలో సస్యరక్షణ పద్దతులు పాటించిలని ఉద్యానవన శాఖ అధికారి గోపిచంద్ తెలిపారు. నాగులుప్పలపాడులో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మిర్చి రైతులకు తోటబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ మిర్చి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం సాగులో ఉన్న మిర్చి తోటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వన అధికారులు ప్రత్యూష, హారిక, రైతులు పాల్గొన్నారు.



దాణామృతం పంపిణీ చేస్తున్న అధికారులు

దాణామృతం పంపిణీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మండల పరిధిలోని కరవది పశు వైద్యశాలలో పశు పోషకులకు 600 కిలోల దాణామృతం మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యశాల వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కె.లక్ష్మయ్య మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన దాణామృతం 40 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కిలో దాణామృతం పూర్తి ధర రూ.15.80 కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.9.40, రైతు వాటా రూ.6.40 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కొక్క రైతుకే గరిష్టంగా 1,800 కిలోలు దాణామృతాన్ని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దేవరపల్లి కోటేశ్వరరావు, ఎంపిటిసి మన్నె శ్రీనివాసరావు, పశు పోషకులు, గ్రామ పెద్దలు, పశు వైద్య సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

అటవీ భూములను కాపాడాలని వినతి

పెద్దదోర్నాల : అటవీ భూములను కాపాడి, కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జీవోను రద్దు చేయాలని కోరుతూ ఆర్ఐ భాస్కర్‌కు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అటవీ హక్కుల చట్టాన్ని మార్పు చేసి పెట్టుబడిదారుల కోసం నూతనంగా చట్టాన్ని తెస్తున్నట్లు తెలిపారు. దీంతో దేశ వ్యాప్తంగా గిరిజనులకు, ఆదివాసులు వేలాది ఎకరాల భూమిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, పిచ్చయ్య, కుమార్, వెన్నా గాలిరెడ్డి పాల్గొన్నారు.

రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-తర్లుపాడు



మార్కాపురంలో జెండా ఆవిష్కరణ

రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఏరువ పాపిరెడ్డి కోరారు. రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాపిరెడ్డి మాట్లాడుతూ రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అనంతరం రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఒకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గాలి నెమిలిరెడ్డి, బొంత బ్రహ్మారెడ్డి, చెరుకుల భాస్కర్‌రెడ్డి, కె.కాశిరెడ్డి, ఎ.వెంకటరెడ్డి, పెరికె. కోటయ్య, దూదేకుల మీరయ్య, గాయం వెంకటేశ్వర్లు, బి.వీరయ్య పాల్గొన్నారు. **మార్కాపురం రూరల్** :మండల పరిధిలోని పెద్దనాగులరం గ్రామంలో రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు, మాజీ సర్పంచి బొమ్మన బోయిన వెంకట సుబ్బయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రేపాని తిరుపతయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గుమ్మ బాలనాగయ్య, తురక ఏడుకొండలు, రైతు సంఘం గ్రామ కార్యదర్శి ఓర్సు అడివయ్య, నాయకులు ఆర్.నాగేశ్వరరావు, ఓర్సు వెంకటేశ్వర్లు,పిన్నిక పెద్ద అల్లూరయ్య, పిన్నిక నారాయణ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ప్రగతి సాధిస్తాం : చైర్మన్

ప్రజాశక్తి-మార్కాపురం



శంకుస్థాపనలో చైర్మన్ చిర్లంచెర్ల

మార్కాపురం మున్సిపాలిటీలో గతంలో కంటే మెరుగైన ప్రగతిని సాధిస్తామని మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 13వ వార్డులో ప్రజల కోరిక మేరకు మురుగు కాలువల నిర్మాణానికి రూ. 9.80 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో భాగంగా మురుగు కాలువ నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాలమురళీ కృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో మార్కాపురం మున్సిపాలిటీ మరింత అభివృద్ధి సాధించేలా పనిచేస్తామన్నారు. . ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్.అంజమ్మ శ్రీనివాస్, మున్సిపల్ డిఇ షేక్ సుభానీ, వైసిపి నాయకులు షేక్ మహ్మద్ ఉస్మాన్ పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికులకు
బకాయి జీతాలు విడుదల చేయాలని వినతి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



ఎంపిఒకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

స్వచ్ఛ భారత్ కార్మికులకు 14నెలల జీతాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎంపిడిఒ ఎ.రంగనాయకులుకు గిద్దలూరు డివిజన్ సిఐటియు నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులకు 14 నెలలుగా జీతాలు ఇవ్వలేదని తెలిపారు. పారిశుధ్యం పనుల ద్వారా ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికులకు జీతాలు ఇవ్వక పోవడంతో వారు పస్తులతో గడపాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. పేరం రోజులలోపు కార్మికులకు జీతాలు చెల్లించక పోతే ఈనెల 23 నుంచి స్వచ్ఛ భారత్ కార్మికులు సమ్మె చేపట్టనున్నట్లు స్వచ్ఛభారత్ కార్మిక సంఘం నాయకుడు జి.ఆనందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయ కులు బి. నర్సింహులు, ఓ.ఆంజనేయులు, స్వచ్ఛ భారత్ కార్మిక సంఘం నాయకులు నరసయ్య, కుమార్, పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ నజీర్ అహ్మద్ ● గ్రంథాలయ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన ఏర్పాటు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

విద్యార్థులు తప్పకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ నజీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాపట్ల శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. గ్రంథాలయ అధికారి ఏ శివాజీ గణేషన్ అధ్యక్షత వహించారు. శివాజీ గణేషన్ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల గురించి వాటి ఉపయోగాల గురించి విద్యార్థులకు తెలియపరిచారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ సయ్యద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా క్లాస్ పుస్తకాలతో పాటు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు వారి చదువుల అనంతరం తప్పనిసరిగా గ్రూప్స్, సివిల్స్ ఇతర కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ప్రిపేర్ అవ్వాలంటే గ్రంథాలయాలకు వెళ్లి అక్కడ ఉన్న పుస్తకాలను చదువుకుంటే వారికి ఉద్యోగం వచ్చే అవకాశం ఉందన్నారు. డాక్టర్ పిసి సాయిబాబా మాట్లాడుతూ నేటి యువత తప్పనిసరిగా గ్రంథాలయాలకు వెళ్లి అక్కడ ఉన్న పుస్తకాలు చదువుకొని ప్రయోజకులు కావాలని కోరారు.



గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న సయ్యద్



పుస్తక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పివి ప్రసాద్



భట్టిప్రోలులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

చీరాల: విద్యార్థులందరూ గ్రంథాలయాలలో ఉండే పుస్తకాలను అధ్యయనం చేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పోలవరపు వెంకట ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన, పుస్తక పఠనం యొక్క ఉపయోగాల గురించి అనేకమంది మహానుభావులు వారి అనుభవాలను పుస్తకాల్లో రచించి నేటి యువతకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అనంతరం గ్రంథ పాలకులు డి ధనమ్మ మాట్లాడుతూ గ్రంథాలయంలో 30 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయని, 1800 నూతన పుస్తకాలు ఒంగోలు నుంచి విద్యార్థుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలను అధ్యయనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎ సుబ్బారావు, సిహెచ్ కృష్ణమూర్తి, ఎస్ సుబ్బరామయ్య, జిపివి ప్రసాదు, మహానంది పలువురు పాల్గొన్నారు.

నిజాంపట్నం: గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలని గ్రంథాలయ అధికారి ఎన్ విజయలక్ష్మి అన్నారు. 55వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిజాంపట్నం గ్రంథాలయంలో విద్యార్థులచే పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎన్ విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చెప్పారు. విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవడాన్ని ఆలవాటుగా మార్చుకోవాలని సూచించారు. పుస్తకాలను చదవడం ద్వారా విషయ పరిజ్ఞానం, సమాజం పట్ల సమగ్ర అవగాహనను పెంపొందించుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ మెంబర్స్ షేక్ తాజుద్దీన్, కొల్లిపర నరసింహారావు, కొల్లిపర శ్రీనివాసరావు, హైస్కూల్ పాఠశాల ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: స్థానిక మాటూరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవంలో భాగంగా రెండో రోజైన మంగళవారం విద్యార్థులకు పుస్తకం పఠనంపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ కలపాల సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ తాడివలస దేవరాజు

విద్యతోనే సమాజంలో గుర్తింపు

డాక్టర్ తాడివలస దేవరాజు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

నేటి చిన్నారులే రేపటి భావి భారత పౌరులని, క్రమశిక్షణ, లక్ష్య సాధన దిశగా విద్యను అభ్యసిస్తే ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చీరాల శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మార్టూరు నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ ఆవరణలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకమాస వన భోజన సమారాధన కార్యక్రమంలో డాక్టర్ తాడివలస దేవరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులు ఒకరికొకరు పరస్పరం సహకారం అందించుకుంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. తమ చిన్నారులను చిన్ననాటి నుంచే చదువు పట్ల ఆసక్తి కలిగించి ఉన్నత విద్య అభ్యసించే విదంగా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం మార్టూరు నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీర్నపాటి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ ఐక్య వేదిక కన్వీనర్ పిల్లుట్ల సుధాకర్, ఆంధ్రప్రదేశ్ వివాహ వేదిక కన్వీనర్ రాఘవరావు, విశ్రాంత పోలీస్ అధికారి మధు, మార్టూరు నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు సుబ్బారావు, ఉప్పలపాటి అశోక్, చెన్నుపల్లి మారుతి రావు, ఎం సాయి, మధు, జాగర్లమూడి వెంకటేశ్వర్లు, ఆవుల రామారావు, ఎన్ సాయి, హనుమంతరావు, నాయీ బ్రాహ్మణ సంఘ యువత, మహిళలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో 'వ్యవసాయ' భవనం

ఆర్‌బికె నుంచి కార్యకలాపాలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండల వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరి మూతపడింది. సుమారు 50 ఏళ్ల క్రితం వెల్లటూరు ఛానల్ పక్కన బస్టాండ్ వద్ద నిర్మించిన గోదాములోనే ఇన్నేళ్లుగా అధికారులు కార్యకలాపాలు నిర్వహించారు. కాగా ఇప్పటివరకు శాశ్వత కార్యాలయం గురించి ఏ ఒక్కరూ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం ఉన్న కార్యాలయం రేకులు పగిలి వర్షపు నీరు కారుతుండడంతో పూర్తిగా మూసివేసి భట్టిప్రోలు రైతు భరోసా కేంద్రం నుంచి వ్యవసాయ అధికారి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. మండలంలో సుమారు 15 వేల ఎకరాలలో రైతులు వరి పంటను సాగు చేస్తుంటారు. దాదాపు నాలుగు వేల మందికి పైగా రైతులు, కౌలు రైతులు ఉన్నారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నారు. అయితే చిరకాలంగా గుర్తింపు ఉన్న ఈ కార్యాలయం వద్దకు నిరంతరం వివిధ పనులపై రైతులు వచ్చి తిరిగివెళుతున్నారు. ఎప్పుడూ తాళాలు వేసి ఉండటం, కనీసం సమాచారం కూడా ఇచ్చే వారు లేకపోవటంతో వచ్చినవారు అసహనానికి గురై వెనుదిరగక తప్పటం లేదు. ముఖ్యంగా వ్యవసాయాధికారి ఎక్కడుంటాడో తెలియని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మూతపడిన వ్యవసాయ కార్యాలయం



బస్సు సర్వీసును ప్రారంభించిన రాష్ట్ర సిఐడి అధికారి పివి సునీల్ కుమార్

చీరాల-ఒంగోలు బస్సు సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి-చీరాల

స్థానిక చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఆవరణంలో మంగళవారం చీరాల ఒంగోలు బస్ సర్వీసులను మంగళవారం రాష్ట్ర సిఐడి అదనపు డైరెక్టర్ జనరల్ పివి సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఆర్టీసీ అన్ని ప్రాంతాలకు బస్ సౌకర్యాలు కల్పించాలని, రూరల్ ప్రాంతాల్లో ఆర్టీసీ ఆ పలు సౌకర్యాలు కల్పించి ప్రయాణికులకు ఆర్టీసీ ఆసరాగా నిలవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పి శ్రీకాంత్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఒకటో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, టూ టౌన్ సిఐ సోమశేఖర్, కారంచేడు ఎస్ఐ అనిత, ఎస్‌బి ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అలంకారప్రాయం.. క్రీడా వికాస కేంద్రం

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామంలో క్రీడా వికాస కేంద్రం ఏర్పాటు శంకుస్థాపనకే పరిమితమైంది. 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక క్రీడా వికాస కేంద్రం ఏర్పాటులో భాగంగా ఏల్చూరు గ్రామాన్ని ఎంపిక చేశారు. రెండు కోట్ల రూపాయల నిధుల అంచనాతో ఈ క్రీడా వికాస కేంద్రాన్ని మంజూరు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 198/23లో 5 ఎకరాల విస్తీర్ణంలో స్థలాన్ని కేటాయించారు. అప్పటి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ 2019 జనవరి 11వ తేదీన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శంకుస్థాపన జరిగి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా నేటికీ స్టేడియం పనులు మొదలు కాలేదు. పైగా గ్రామ పెత్తందారుల కనుసన్నలలో కొందరు ఆ భూమి ఆక్రమించి ఇళ్లు నిర్మించారు. స్టేడియానికి కేటాయించిన స్థలంలో ఆక్రమించిన వారిని తొలగించాలని, క్రీడా వికాస కేంద్రాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఏల్చూరు గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



ఏల్చూరులో అలంకారప్రాయంగా ఉన్న క్రీడా వికాస కేంద్రం శిలాఫలకం

రైతుల అభివృద్ధే సహకార బ్యాంకు లక్ష్యం

ప్రజాశక్తి-చీరాల

రైతులను అప్పుల బారిన పడనీయకుండా వడ్డీ వ్యాపారుల నుంచి, దళారుల కబంధ హస్తాల నుంచి కాపాడి వారి అభివృద్ధికి తోడ్పాటునందించటమే సహకార బ్యాంకు యొక్క ముఖ్య ఉద్దేశమని బ్యాంకు రీజినల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ కుంభ రాఘవయ్య అన్నారు. బ్యాంకు 69వ సహకార వారోత్సవాలలో భాగంగా మంగళవారం చింతకుంట గ్రామంలోని బ్యాంకులో జరిగిన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ గ్రామ బ్యాంకు చైర్ పర్సన్ మారెళ్ల రామకృష్ణ, చీరాల బ్రాంచ్ మేనేజర్ టీఎస్ వాసుదేవ్ సింగ్ తదితరులు మాట్లాడుతూ ఇతర బ్యాంకుల కన్నా అత్యధిక వడ్డీ ఇస్తున్నది సహకార బ్యాంక్ అని, ఖాతాదారులకు మెరుగైన సేవలను అందజేయడంతో పాటు రుణాలను అందిస్తూ వారికి ఆర్థికంగా చేయూతను అందిస్తోందని పేర్కొన్నారు. అనంతరం అన్ని రంగాలలో సహకార వ్యవస్థ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ బ్యాంకు అందిస్తున్న పలు రుణాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా సహకార జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహకార ఆడిటర్ వి బాలబ్రహ్మం ఆర్వో మేనేజర్ విశ్వేశ్వరరావు బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, సంఘం సీఈవో జి శేఖర్‌రావు, సిబ్బంది నాగరాజు, వీరయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలోని స్థానిక రామానాయుడు కల్యాణ మండపంలో బుధవారం నాడు జరిగిన ఉచిత వైద్య శిబిరానికి 250 మంది హాజరయ్యారు. వీరందరికీ పరీక్షలు చేసిన వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా స్థానిక ఎంపీపీ నేర్పట్ల వాసుబాబు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో జడ్పిటిసి యార్లగడ్డ రజిని, మండల వైసీపీ ఇన్‌ఛార్జి దండా చౌదరి బాబు, కారంచేడు వైసిపి నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు కిమ్స్ వైద్యులు జనరల్ సర్జన్ డాక్టర్ బి రామాంజనేయులు, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్ షేక్ ఖాదర్ వలి, ఆప్తమాలజిస్ట్ ఆర్ రాణి పాల్గొన్నారు.

గడువు లోపు

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం, గడువు ప్రకారం జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం హౌసింగ్ విభాగ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు 21 నాటికి 14,371 ఇళ్లు పూర్తి కావాలన్న ప్రభుత్వ ఆదేశం మేరకు పనులు వేగంగా జరి గేలా చూడాలన్నారు. మండలాల వారీగా ఈ ఇళ్ల నిర్మాణ పురోగతిని ఆయన సమీక్షించారు. నిర్మాణ పనులు తుది దశకు చేరిన చోట లబ్ధిదారులు త్వరగా వాటిని పూర్తి చేసేలా అధికారులు శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పేరయ్య, ఈఈలు, డిఈఈలు, ఏఈఈలు, డిఆర్‌డిఏ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఈవిఎం గోదాముల పరిశీలన

మామిడిపాలెంలోని ఈవిఎం గోదాములను కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. నెలవారీ తనిఖీలలో భాగంగా గోదాము తాళాలకు వేసిన సీలు సరిగ్గా ఉందో, లేదో ఆయన తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన భద్రత, ఇందుకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించి.. సంతప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగ పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతున్న ప్రభుత్వం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షత చూపుతుందని పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఆర్‌సి ఇస్తామని చెప్పి ఉద్యోగులను జగన్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పిఆర్‌సి పేరుతో జగన్ ప్రభుత్వం కేంద్రం నుంచి కోట్ల రూపాయలు దండుకొని ఉపాధ్యాయులకు మెండిచెయ్యి చూపిందని విమర్శించారు. తొలుత మండల పరిధిలోని పి.నాగులవరం, కెజిబివి పాఠశాలను సందర్శించి అక్కడి ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడారు. కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు పి.మాలకొండారెడ్డి, యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎస్‌కె. రజియాబేగం, మండల నాయకులు జె.వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి

ఎస్‌సి, ఎస్‌టి కేసులలో

సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలి

ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పోలీస్ అధికారులు వత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని ఎస్‌సి, ఎస్‌టి కేసులలో విచారణ జరపాలని ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని డీఎస్పీలతో ఎస్సీ,ఎస్టీ కేసులపై ఎస్‌పి సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం నమోదయిన కేసుల వివరాలు, వాటి పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసు ఫైల్స్‌ను స్వయంగా పరిశీలించి.. సదరు కేసులలో దర్యాప్తు, నిందితుల అరెస్ట్, ఛార్జిషీటు దాఖలు, తదితర విషయాలలో తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదులు అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టాలని, కేసుల విచారణ సమయంలో బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని చెప్పారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ వత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి త్వరితగతిన విచారణ పూర్తి చేయాలన్నారు. నిర్దేశిత కాల వ్యవధిలో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి, సమర్ధవంతమైన ట్రయిల్ ద్వారా నిందితులకు కఠినశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు, దర్యాప్తులో అలసత్వం వహించరాదని, అలసత్వం వహించిన పోలీస్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో బాపట్ల సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఏ.శ్రీనివాసరావు, చీరాల సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పి శ్రీకాంత్, డిసిఆర్‌బి డిఎస్‌పి జి లక్ష్మయ్య, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ ఎన్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్‌జిందాల్



మాట్లాడుతున్న డీన్ జాన్‌వెస్లీ

విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలి: జాన్‌వెస్లీ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని బాపట్ల ఫుడ్ సైన్స్ కాలేజ్ అసోసియేట్ డీన్ బి.జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం కళాశాల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని బాపట్ల మండలం బేతపూడి గ్రామంలో ఆయన ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే సేవా పథకంలో విద్యార్థులు సేవాతత్పరతతో పాటు ఆర్థిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ అంశాలపై గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా గ్రామంలో రోజుకొక సమస్యలపై సర్వే నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో బేతపూడి సర్పంచ్ ఏకుల కుమారి, కార్యదర్శి మాణిక్యమ్మ, కళాశాల అధ్యాపకులు జి.రవి కాంతారావు, రాజ్ పాల్, తిరుపతిరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విమల బీర పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

మహిళలకు రక్షణ కరువు: ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని, మహిళలపై దాడులు పెరిగాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి విమర్శించారు. కనిగిరి పట్టణంలోని రెండో వార్డు బిసి కాలనీలో మాటామంతీ కార్యక్రమాన్ని తెలుగు మహిళా అధికార ప్రతినిధి కరణం అరుణ, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వాజిద ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు నాయకత్వంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, టిడిపి నాయకులు షేక్ ఫిరోజ్, చింతలపూడి తిరుపాలు, నారాయణమ్మ, తులసి, స్వప్న, సుధ, భాగ్యలక్ష్మి స్వాతి, ఊర్మిల, సలోమి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బసివిరెడ్డి

'సమాఖ్య' అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని సమాఖ్య అధ్యక్షులు వాకా బసివిరెడ్డి తెలిపారు. పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య ప్రధాన కార్యాలయంలో 69వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత సహకార శాఖ జెండాను సమాఖ్య అధ్యక్షులు వాకా బసివిరెడ్డి ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా సహకార అధికారి పి.రాజశేఖర్ సహకార వారోత్సవాల ఆవశ్యకతను వివరించారు.

అటవీ బిల్లును వెనక్కి తీసుకోవాలి

- రైతు సంఘాల సమన్వయ సమితి నాయకుల డిమాండ్
- బిల్లు పత్రుల దహనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గిరిజన ప్రయోజనాలు, హక్కులకు భంగం కలిగించే బిల్లును వెనక్కి తీసుకోవాలని ప్రకాశం జిల్లా రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షతన జరిగింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అటవీ చట్టాలకు రూల్స్, రెగ్యులేషన్స్ 2022 పేరిట తెచ్చిన బిల్లు గిరిజనుల ప్రయోజనాలు, హక్కులకు భంగం కలిగించేది ఉందని, ఆ బిల్లును వెనక్కి తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు రైతు వ్యతిరేక చట్టాలను రైతు ఉద్యమం కారణంగా రద్దు చేసే విషయంలో భాగంగా ఢిల్లీ రైతు సంఘాల నాయకులకు లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలు నెరవేర్చటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. తీవ్ర కాలయాపనతో కేంద్రం ఎత్తుగడలకు పాల్పడుతోందన్నారు. ఉద్యమం ప్రారంభమై ఈనెల 26కి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు చలో రాజ్‌భవన్ కార్యక్రమంపై చర్చించారు. రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు మేరకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఉపాధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు, ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డె హనుమారెడ్డి, ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, ఏఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘ జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి, గిరిజన నాయకులు పేరం సత్యం, ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, మారెళ్ళ శేషసాయి పాల్గొన్నారు.



బిల్లు ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

రాంబ్రహ్మయ్య హత్య కేసు

నిందితులను అరెస్టు చేయాలి

ఎస్‌పిని కోరిన కెవిపిఎస్ బృందం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సొలసా రాంబ్రహ్మయ్య హత్య కేసు నిందితులను అరెస్టు చేయాలని ఎస్‌పి మలికా గార్గ్‌ను కెవిపిఎస్ జిల్లా బృందం కోరింది. స్థానిక ఎస్‌పి కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ గ్రీవెన్స్‌లో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్ మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో జరిగిన ఈ ఘటనపై పలుమార్లు మంత్రి, కలెక్టర్, జిల్లా ఎస్‌పిని కలిసినా నేటికి కూడా దోషులను అరెస్టు చేయలేదన్నారు. దోషులను అరెస్టు చేయక పోవడానికి ఉన్న అంతర్గత కారణాలు ఏమిటో తెలియజేయాలన్నారు. తన భర్తను చంపారని, నిందితులను పేర్లతో సహా భార్య చెబుతున్నప్పటికి ఈ విషయంలో పోలీసులు ఈ కేసు పట్ల దర్యాప్తును నిర్లిప్తతతో కొనసాగించటంపై ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసుపై రీ ఎంక్వయిరీ వేయాలని కోరగా దర్శి డిఎస్పీని ఈ కేసులో ఐవోగా వేశారని తెలియజేశారు. కేసును సిబిసిఐడికి అప్పగించాలని వారు కోరారు. ఎస్‌పిని కలిసిన వారిలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అట్లూరు రాఘవులు, ఉపాధ్యక్షులు టి. రామారావు, రాం బ్రహ్మయ్య భార్య సొలసా ధనలక్ష్మి ఉన్నారు.



బాధితులతో కెవిపిఎస్ నాయకులు

వెనుకబడిన కనిగిరి అభివృద్ధికి కృషి

జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-కనిగిరి

వెనుకబడిన కనిగిరి ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన జడ్పీటీసీ క్యాంపు కార్యాలయంను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

వెంకాయమ్మకు ఘన సన్మానం

కనిగిరిలో జడ్పీటీసీ కార్యాయం ప్రారంభించేందుకు వచ్చిన జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మను ఏరువారిపల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, ఎంపీటీసీ సభ్యులు ఎం.రమణారెడ్డి ఘనంగా సన్మానించారు.